# సిద్ధంపునగర్ కాలనీ

**11**

## సైట్ సీయింగ్ - హైద్రాబాద్ స్టైల్

ఆమధ్య వాళ్ళ చుట్టాలింట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు మా రంగారెడ్డి, యాదగిరి చుట్టూ ఆ పల్లెటూరి వాళ్ళంతా మూగిపోయారట.

హైద్రాబాద్ నగరంలో వుండే వాళ్ళు ఎంత ఆధునికంగా వుంటారో, ఎంత ఆధునికంగా ప్రవర్తిస్తారో, ఎంత ఆధునికంగా ఆలోచిస్తారో ఇవన్నీ వాళ్ళకు విడ్డూరంగా కనిపించినయ్.

"మీరు రోజూ డబుల్ డెక్కర్ బస్ ఎక్కుతారా?' అనడిగాడట ఓ చిన్న కుర్రాడు.

యాదగిరి ఆ ప్రశ్నకు చాలాసేపు నవ్వి ఆ కుర్రాడి భుజంతట్టి "రెండుడబుల్ డెక్కర్‌లు మారి రోజూ ఆఫీస్‌కివెళ్తాం" అని చెప్పాడు.

"మీరు చార్మినార్ చూశారా?" అని ఇంకో పెద్దమనిషి అడిగాడట.

రంగారెడ్డి పగలబడి నవ్వాడట.

"మేము కనీసం వారానికి రెండు సార్లయినా చార్మినార్ వేపు వెళ్తానే వుంటాం" అనేసరికి అందరూ థ్రిల్ ఫీలయారట.

గోల్కొండ ఫోర్ట్, టాంక్‌బండ్, జూ, సాలార్‌జంగ్ మ్యూజియమ్, బిర్లామందిర్, ప్లానెటోరియం, అసెంబ్లీ భవనం, కృష్ణ ఓబెరాయ్ హోటలూ, సినిమా స్టూడియోలు, ఇందిరా పార్కు వీటన్నింటి గురించీ ఆడా మగా అడుగుతుంటే అవన్నీ ఎంతో చిన్న విషయాలయినట్లు మా వాళ్ళు పోజిచ్చారట.

వారు శెలవు రోజులు చూసుకుని హైద్రాబాద్ వస్తే రెండ్రోజుల్లో హైద్రాబాద్ లోని ప్రదేశాలన్నీ చూపిస్తామని చెప్పేశారు.

"మీకు పంపుల్లో నీళ్ళొస్తాయట కదా! మాలాగా బావిలో నీళ్ళు తోడుకోవాల్సిన పని లేదట కదా?" అని ఓ కుర్రాడు, "మీరు మా ఊళ్ళోలాగా కట్టెల పొయ్యితో వంట చేయరంట కదా, గాస్‌తో చేస్తారంట కదా" అని ఇంకొకరు, "మీకు పెద్ద పెద్ద రోడ్లు, రోడ్ల మధ్య ఫౌంటెన్‌లూ వుంటాయట కదా" అని మరొకరూ, "మీ సిటీలో ఎటు వెళ్ళాలన్నా బస్‌లూ, లోకల్ రైళ్ళూ వుంటాయట కదా" అని ఒకరూ ఇలా అడుగుతూంటే మరింత పొంగిపోయి "అవునవును. హైద్రాబాద్ అంటే ఏమిటనుకున్నారు? ఆసియాలోనే చాలా పెద్ద సిటీ అది. పైగా మిగతా సిటీల్లా కాకుండా చాలా అందంగా వుంటుంది" అనేశారట. "అవునవును. కార్పొరేషన్ చేసే ప్రకటనలు కూడా చూశాం-'అందమైన నగరం మనది-సుందరంగా వుంచుదాం మనందరం'" అన్నారు వాళ్ళు. ఆ మాటలకు ఎట్రాక్ట్ అయిపోయి వాళ్ళు హైద్రాబాద్ ప్రయాణం కట్టారు, శని ఆదివారాలు శెలవు రోజులొచ్చేట్లు చూసుకుని. మేమందరం శనివారం పొద్దున్నే స్టేషన్ కెళ్ళాం వాళ్ళను రిసీవ్ చేసుకోటానికి. రైలు టైముకొచ్చేసింది.

ఆడా మగా పిల్లా పీచూ అంతా కలిసి ఓ పది మంది రైలు దిగారు.

మా వాళ్ళందరినీ పరిచయం చేశాడు రంగారెడ్డి.

"ఇతను ఉదయార్కర్" అన్నాడతను.

నాకు అలా కేవలం ఉదయార్కర్ అని వదిలెయ్యటం చిన్నతనమనిపించింది.

"మా కాలనీ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌ని లెండి" అన్నాను గొప్పగా.

"ఇతను జనార్దన్"

జనార్దన్ చాలా స్టైల్‌గా కాలర్ సర్దుకుని "నన్ను పరిచయం చేసేదేముందిలే! సినిమాల్లో నన్ను చూసే వుంటారుగా" అన్నాడు.

వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

"సినిమాల్లోనా? మీరు సినిమాల్లో వేస్తారా?" అనడిగారు ఉత్సాహంగా.

"ఆ...ఏదో టైమ్ దొరికినప్పుడు హీరోగా వేస్తూంటాను చాలా పిక్చర్స్‌లో. ఎవరికయినా ఆటోగ్రాఫ్‌లు కావాలంటే తర్వాత ఇస్తాను" అన్నాడు.

"ఆటోగ్రాఫంటే ఏమిటి?" ఓ కుర్రాడు ఆసక్తిగా అడిగేసరికి రంగారెడ్డి టాపిక్ మార్చేశాడు. అందరం స్టేషన్ బయటకు నడుస్తూంటే వాళ్ళల్లో ఒకాయన రంగారెడ్డిని పిలిచాడు.

"ఏరా రంగారెడ్డీ, రైల్వే స్టేషన్ అద్దంలాగుందే-తస్సాదియ్యా! ఇంత పెద్ద స్టేషన్ నేనెక్కడా సూళ్ళా" అన్నాడు ఆనందంగా.

"సిటీ అంటే ఏంటనుకున్నావ్ మరి? అన్నీ సిస్టమేటిగ్గా బ్రహ్మాండంగా వుంటాయ్" అన్నాడు రంగారెడ్డి గర్వంగా.

"ఓరి రంగారెడ్డా! ఆడ కాఫీ ఇస్తున్నట్టున్నారుకదరా! ఓ కప్పు తాగుదారేటి?" ఓ బంధువు అడిగాడు.

అందరం ఉలిక్కిపడ్డాం.

"ఇక్కడా! ఇక్కడ కాఫీ, టీలు తాగకూడదు. ఈ స్టేషన్లో పనిచేసే వాళ్ళే బయట ఆల్ఫా హోటల్ కెళ్ళి తాగుతారు!" చెప్పాడు గోపాల్రావ్.

"అదేటి? ఎందుకు తాగ్గూడదు?"

"ఏమో మనకు తెలీదుగానీ తాగిన వాళ్ళు చాలా మంది చెప్తూంటారు-తాగొద్దని" అప్పుడే కాంటీన్ కాఫీ తాగిన ఒకడిని వాళ్ళ బంధువులు భుజం మీద వేసుకుని హడావుడిగా బయటకు మోసుకెళ్ళసాగారు. అందరం స్టేషన్ బయటకు నడిచాము. బయటి కొస్తూనే అందరం ఠకీమని ముక్కులు మూసుకోవాల్సి వచ్చింది.

"ఏటిక్కడ ఇంత పెద్ద వాసనొస్తోంది?" అడిగారు వాళ్ళంతా ముక్కులు మూసుకుంటూ. మేము మళ్ళా ఆశ్చర్యపోయాం.

"చెడ్డ వాసనేమిటి? మాకేం రావట్లేదే" అన్నాం చుట్టూ చూస్తూ.

"రాపోటమేంటహ! ఇంత దరిద్రపు వాసన మా జన్మలో సూళ్ళే! థూ!" అంటూ అందరూ ఉమ్మి వేశారు.

అందరం ఓ క్షణం ఆలోచించాం-

మాకు రాని చెడు వాసనలు వీళ్ళకెలా వస్తున్నాయా

యర్రంశెట్టి శాయి

అవి.

అప్పుడర్థమయి పగలబడి నవ్వుకున్నాం.

"ఓర్నీ అదా! అది మామూలుగా మన హైద్రాబాద్ సికింద్రాబాద్ నగరాల్లో వుండే వాసనే! పెద్ద సిటీ కదా! చెత్తా చెదారం ఎక్కువ. అందుకని ఆ వాసనలు నగరంలో ఏమూలకెళ్ళినా తప్పదు. నగరంలోనే ఇలా వుంటుంది గానీ మా అవుట్ స్కర్ట్స్‌లో చాలా బావుంటుంది" అన్నాడు శాయిరావ్ సర్దిచెప్తూ.

"మరి ఇంత దరిద్రపు వాసనతో ఈ జనమంతా ఎట్టా బతుకుతుండారెహె" అన్నాడింకో కతను. మేము ఆ మాట విననట్లు నటించాం. బయట వరుసగా నిలబడ్డ ఆటోలను చూస్తూనే పల్లెటూరి పిల్లలు ముచ్చట పడ్డారు.

"నానా నానా! ఆటోల్లో పోదారే! బలే బాగున్నాయ్" అన్నారు వాళ్ళు.

"ఆటోలా? ఊహు! వద్దు! స్టేషన్ దగ్గర ఆటోలు మనలాంటి బీదాళ్ళ కోసం కాదు. సిటీలో ఎక్కడయినా ఎక్కుదాంలే" అన్నాడు రంగారెడ్డి.

"అదేంట్రా! ఎవరెక్కినా మీటర్ తిరుగుద్దిగా!" ఎవరో అడిగారు.

"స్టేషన్ దగ్గర ఆటోలకు ఆ రూల్స్ వర్తించవులే, వాళ్ళసలు మీటరు వెయ్యరు. వందో, రెండొందలో అడుగుతారు. అంతే!"

స్టేషన్ బయటి గేటు దగ్గరికొచ్చాం అందరం.

"ఇదేంట్రా! ఇంత పెద్ద మురిక్కాలవ వుందిక్కడ! ఎలా దాటేది దీన్ని" ఆగిపోయి ఆశ్చర్యంగా అడిగారు.

మేము మళ్ళా ఆశ్చర్యపోయాం.

"మురిక్కాలవ కాదిది. డ్రైనేజి వాటర్! సాధారణంగా అది రోడ్ మీద ప్రవహిస్తాం టుంది. మన రాజధానిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారీ పద్ధతి" చెప్పాను నేను.

అందరం ఆ పక్కనే వున్న బస్టాండ్ వెళ్ళాం.

"అందరికీ హాలిడే టికెట్స్ తీసుకోండి! చాలా చౌకగా రోజంతా ప్రయాణం చేయవచ్చు. ఎన్ని బస్‌లయినా, ఎన్నిసార్లయినా ఎక్కవచ్చు. కేవలం మీలాంటి టూరిస్ట్స్ కోసమే ఆర్టీసీ వాళ్ళు ఈ సదుపాయం ఏర్పాటుచేశారు" చెప్పాడు గోపాల్రావ్.

"ఓర్నీ-ఆర్టీసీ వోళ్ల ఇంత మంచోళ్ళా?" ఆశ్చర్యపోతూ అడిగారు.

అందరికీ హాలిడే టికెట్స్ కొనేశాము.

మా కాలనీ కెళ్ళే బస్ కోసం అరగంట వెయిట్ చేశాక కంట్రోలర్ దగ్గరకు నడిచాం.

"మా నిర్భయ్ నగర్ కాలనీ బస్ అరగంట నుంచి రాలేదు-కారణం ఏమిటంటారు?"

"హాలిడే గదయ్యా! ఇవాళ చాలా బస్‌లు కాన్సిల్ చేస్తాంటాము"

"అయితే మరి ఎన్నిగంటలకు బస్ వస్తుందంటారు?"

"అది డిపో మేనేజర్ నడగాలి" అనేసి మా దగ్గర్నుంచి దూరంగా వెళ్ళి నిలబడ్డాడు. ఇంకో అరగంట చూసి అందరం ఆటోల్లో వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. మా గుంపుని చూస్తూనే ఆటోవాళ్ళందరూ మమ్మల్ని ముట్టుముట్టారు.

"ఎక్కడికెళ్ళాలిసార్?"

"నిర్భయ్ నగర్ కాలనీ-"

ఒక్క సారిగా అందరూ వెనక్కు వెళ్ళిపోయి వాళ్ళల్లో వాళ్ళు కబుర్లు చెప్పుకోసాగారు.

"అదేమిటి? ఆటోలు రావా?"

"ఆబిడ్స్ కయితే వస్తాంసార్!"

"మీటర్ మీద రెండ్రూపాయిలు ఎక్స్ట్రా తీసుకోండయ్యా" వాళ్ళు పెద్ద జోక్ విన్నట్లు పగలబడి నవ్వి మళ్ళీ తమలో తాము ఆటో డ్రైవర్స్ యూనియన్ గురించి మాట్లాడుకో సాగారు.

"పోనీ లోకల్ ట్రైన్‌లో వెళ్దామా?" అడిగాడు ఓ బంధువు.

"అవునవును లోకల్ ట్రైన్, లోకల్ ట్రైన్" అన్నారు పిల్లలు ఉత్సాహంగా.

"మీకేం మతిపోయిందా ఏమిటి? హాలిడేస్‌లో లోకల్ ట్రైన్ ఎక్కకూడదు" చెప్పాడు రంగారెడ్డి.

"ఎందుకని?"

"శెలవుల్లో అవి ఖాళీగా వుంటాయ్. అంచేత దొంగలు, గూండాలు వున్న కొద్ది మంది పాసింజెర్లనూ దోచుకుంటారు."

"అదేమిటి? రాజధానిలోనే ఇలాంటివి పట్టపగలు జరుగుతాయా?" మేము వాళ్ళ మాటలు పట్టించుకోకుండా మళ్ళీ బస్ కోసం నిలబడ్డాము. బస్టాండ్‌లోని యూరినల్స్ నుంచి భయంకరమయిన వాసన ఆ ప్రాంతమంతా వ్యాపిస్తోంది. మాకది మామూలే అయినా ఆ పల్లెటూరి గబ్బిలాయిలకు చాలా అలహ్యంగా వుందిట. అక్కడ ఇంకాసేపు నుంచుంటే వాంతులు కూడా అయేట్లున్నాయని ఆడాళ్ళు గొడవ చేసేసరికి మాకు వాళ్ళమీద చిరాకు పుట్టుకొచ్చింది.

(ఇంకావుంది)



## శాయితో ముఖాముఖి

టి.నిరంజన్, పేరేరు

ప్ర: మీరు ఒక పాఠకునికి సమాధానం ఇవ్వడానికి ఎంతకాలం పడుతుంది?

జ: అది ఎడిటర్‌గారి మీద ఆధారపడి వుంటుంది. ఫుల్ కాలం ఇస్తే ఇవ్వచ్చు. లేదా రెండు కాలాలు పట్టవచ్చు.

ఎం.రాజ్‌కుమార్, సిరిసిల్లా

ప్ర: యర్రంశెట్టి శాయిగారూ మీరు గాని ముఖ్యమంత్రి అయితే నేటి సాహితీ ప్రియులకు ఏమి చేయాలను కుంటున్నారు?

జ: నేను రాసిన నవలలన్నీ విధిగా మా పార్టీ ప్రియులు కొని అందరికీ చదివి వినిపించాలని ఆదేశాలిస్తాను.

కె.ఉమామహేశ్వరరావు, శ్రీశైలం డ్యామ్

ప్ర: లోకంలో అన్నింటికంటే వేగమైంది మనస్సు అన్నారు. దీనిని ఉదాహరణతో రుజువు చేయండి.

జ: మన రాజకీయ నాయకుల మనసులు వీటికి మాటికి స్విట్జర్లాండ్ బాంక్ చుట్టూ పరిభ్రమించడం.

జి.వాసు, ఖమ్మం

ప్ర: నేను కూడా మీలాగా హాస్య సీరియల్స్ రాయాలని వుంది. ఎలా ప్రారంభించమంటారు?

జ: ముందు మీరే నవ్వండి! తరువాత మీ పాత్రలు తెగ నవ్వుతున్నట్లు రాయండి. అంతే హాస్య రచయిత అయి పోతారు.

మంగమూరి శ్రీనివాస చక్రవర్తి, తెనాలి

ప్ర: గురూ గారూ! మా ఫ్రెండ్‌కు ఒక ప్రాబ్లెమ్ వచ్చింది. వాడొక అమ్మాయిని ఘోరాతి ఘోరంగా ప్రేమించాడు. కాని తీరా చూస్తే ఆ అమ్మాయి వాడిని మొదట్లోనే ఛీ పో అన్నది. కనీసం ఒక్కసారి కూడా వాడితో మాట్లాడలేదు. వీడెళ్ళి మాట్లాడదామని ప్రయత్నించినా వెంటనే సీరియస్ అయిపోతుంది. ఫ్రెండ్స్ అందరూ వాడిని "వెంటనే ఆ అమ్మాయిని మర్చిపోరా బాబూ"అని సలహా ఇచ్చారు. అయినా వాడు మజ్ను, రోమియోలకన్నా రెండాకులు చదివినట్టు "నావల్ల కాదురా! ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోకపోతే జీవితంలో అసలు పెళ్ళే చేసికోను"అని భీష్మించు కూర్చున్నాడు. వాళ్లిద్దరూ ఎలా కలుస్తారు? అసలు కలిసే యోగం వుందంటారా? ఆ అమ్మాయి వీడిని లైక్ చెయ్యా లంటే ఏం చేయమంటారు? సీరియస్‌గా సమాధానం ఇవ్వండి.

జ: ఈ అమ్మాయి అతనిని లైక్ చేయాలంటే జీవితాంతం ఆమెకు, ఆమె భర్తకు, పిల్లలకు సేవలు చేయవలెను.

జె.శ్యామసుందరరావు, కే. సముద్రం

ప్ర: న్యాయ దేవత కళ్ళకి గంతలు కడతారెందుకని శాయిజీ?

జ: కళ్ళకు గంతలు కట్టుకున్నా మెజీషియన్ షాడో తిరుపతి ఘాట్ రోడ్ మీద మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేయలేదా ఏమిటి?

డి.కె.చదువుల బాబు, పెదపసుపుల

ప్ర: గురూజీ 26-11-89న ఆకాశవాణిలో ప్రసారమైన 'ఆత్మహత్య' నాటక రచయిత మీరేనా? ఆ నాటికకు ఇన్స్‌పిరేషన్ ఏమిటి?

జ: రచయితని నేనే! దానికి ఇన్స్‌పిరేషన్ ఆత్మహత్యలు.